పూలేతో సామాజిక విప్లవం

- రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్
- ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇతర ప్రజాప్రతినిధులు



పూలే జయంతి వేడుకలలో లబ్ధిదారులకు ఆర్థికసాయం చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం టౌన్/ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సామాన్యుడిగా జన్మించి, సామాజిక విప్లవానికి నాంది పలికిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఆవరణలో పూలే 199వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పూలే విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలు, నిమ్న జాతుల ఉద్ధరణ కోసం పని చేసిన వ్యక్తి పూలే అని కొనియాడారు. బాల్య వివాహాలను రూపుమాపడంలో ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. అంబేడ్కర్‌లాంటి వ్యక్తులను సైతం పూలే ఆలోచనలు ప్రభావితం చేశాయని అన్నారు. సమాజంలో వెనుకబడిన కులాలు, మతాలు, సామాజిక వర్గాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శివనారాయణ శర్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, మాజీ మేయర్ స్వరూప, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల కోసం..

అణగారిన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం జీవితాన్ని ధారపోయిన మహనీయుడు మహాత్మాజ్యోతీరావు పూలే అని కలెక్టరు వినోద్‌కుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కొనియాడారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో శుక్రవారం పూలే జయంతిని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బీసీ కార్పొరేషన్ ద్వారా 477మంది లబ్ధిదారులకు మంజూరైన రుణసాయం చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీ అంబికా మాట్లాడుతూ పూలే ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరు ముందుకుసాగుదామని పిలుపుఇచ్చారు. కలెక్టరు వినోద్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక అసమానతల మీద పోరాటం సాగించిన పూలే మహాత్ముడిగా నిలిచిపోయారన్నారు. పూలే జయంతివేడుకల సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, రామ్మోహన్, సంక్షేమ శాఖల డీడీలు రాధిక, కొఠారి కుష్బూ, రామాంజనేయులు, మైనార్టీ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, బీసీ ప్రతినిధులు, పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎన్‌బీఏకి జేఎన్టీయూ సన్నద్ధం



వివరాలను క్రోడీకరిస్తున్న అధ్యాపక బృందం

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో నాణ్యతా ప్రమాణాల లెక్కింపు ప్రక్రియను చేపట్టే నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు కోసం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల సన్నద్ధమైంది. విభాగాలు వారీగా పరిశీలించి, గుర్తింపు ఇచ్చేందుకు ఎన్‌బీఏ బృందం శనివారం వస్తోంది. ఈ నేపథ్యంలో వివిధ వర్సిటీలకు చెందిన సీనియర్ ప్రొఫెసర్లను బృందంగా ఏర్పాటుచేసి గత నెలలో కళాశాలలో ముందస్తు పరిశీలన చేయించారు. వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య పర్యవేక్షణలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి నెల రోజులు కసరత్తు చేశారు. కళాశాలలోని సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాలు, సైన్స్ విభాగంలో నెలరోజుల నుంచి ఎన్‌బీఏ గుర్తింపునకు అవసరమైన పనులు చేపట్టారు. మూడేళ్లకోసారి అక్రెడిటేషన్ రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. మౌలిక వసతులు, ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, పాఠ్యాంశాల రూపకల్పన, పరీక్షల నిర్వహణ, ఫలితాల శాతం, ఉద్యోగ కల్పన.. ఇలా ప్రతి అంశాన్నీ ఎన్‌బీఏ బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తుంది.

కేసు రాజీ చేయాలని ఒత్తిడి

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌కు పీపీపై న్యాయవాది ఫిర్యాదు

అనంతపురం క్రైం, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): ఓ కేసు విషయంలో డబ్బు డిమాండ్ చేయడం, ముద్దాయిలపై ఒత్తిడి చేసిన విషయంపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరినాథరెడ్డిపై డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌కు ఫయాజ్ అనే న్యాయవాది ఫిర్యాదు చేశారు. కొన్ని రోజుల కిందట చేసిన ఈ ఫిర్యాదు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సెషన్స్ కేసు నెంబరు 167/2023లో డిఫెన్స్ కౌన్సిల్‌గా తాను ఉన్నానని ఫయాజ్ అందులో పేర్కొన్నారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఈ కేసును రాజీ చేయాలని, కాంటెస్ట్ చేయకూడదని తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. మొదట రూ.8లక్షలకు సెటిల్‌మెంట్ చేసినట్లు తనకు తెలిసిందని, మళ్లీ ఈ కేసులో ముద్దాయి తన ఆర్థిక పరిస్థితులతో డబ్బు ఇవ్వలేదని తెలిసిందని, అనంతరం కేసు ట్రయల్‌కు వచ్చినప్పుడు గత ఏడాది డిసెంబరు 9న రూ.3లక్షలు ముద్దాయితో ఇప్పించమని తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. సెటిల్‌మెంట్ చేయాల్సిన అవసరం తనకు లేదని, మీరు, ముద్దాయి ఫిర్యాదితో మాట్లాడుకోమని పీపీకి చెప్పానన్నారు. కానీ తనను ఆ కేసు నుంచి తప్పుకోవాలని ఒత్తిడి చేశారన్నారు. ఈ కేసు విషయంలో పీపీ పెద్ద మొత్తంలో వసూలు చేయాలని నిశ్చయించుకున్నట్లు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసు నుంచి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను మార్చాలని కోరారు. పీపీగా అపాయింట్‌మెంట్ అయినప్పటి నుంచి కొన్ని వందల కేసులు రాజీ చేసినట్లు తెలిసిందని, రాజీ చేసిన కేసులలో డబ్బు వసూలు చేసినట్లు తెలిసిందన్నారు. ఈయన వ్యవహారశైలిపై విచారణ జరిపి ఈ కేసులో కొత్త పీపీని నియమించి నిష్పక్షపాతంగా విచారణ జరిగేలా చూడాలని కోరారు.

అజ్ఞాతంలోకి జైలర్ సుబ్బారెడ్డి

న్యూడ్ కాల్ కేసులో పోలీసుల గాలింపు



సుబ్బారెడ్డి (ఫైల్)

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఓపెన్‌ఎయిర్ జైలు జైలర్ సుబ్బారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు 20 రోజుల నుంచి అజ్ఞాతంలో ఉన్నారు. న్యూడ్ కాల్ చేయాలని ఓ మహిళను ఒత్తిడి చేసినందుకు జైలర్ సుబ్బారెడ్డిపై విశాఖ సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో గత నెలలో కేసు నమోదైంది. సుబ్బారెడ్డిని విచారించేందుకు విశాఖ నుంచి ప్రత్యేక పోలీసు బృందం అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలుకు మార్చి 23న వచ్చినట్లు సమాచారం. దీంతో అప్రమత్తమైన ఆయన.. పోలీసుల కంటపడకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మార్చి 23 నుంచి అతను విధులకు హాజరు కావడం లేదని జైలు సూపరింటెండెంట్ ఏబీ క్రాంతిరాజ్ శుక్రవారం తెలిపారు. మార్చి 22న విధి నిర్వహణలో ఉన్నాడని, మరసటిరోజు డ్యూటీకి రాలేదని, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడని తెలిపారు. కుటుంబ సభ్యులను ఆరాతీయగా, అనారోగ్యంగా ఉన్నాడని, ఆస్పత్రికి వెళ్లాడని చెప్పారని అన్నారు. అదే రోజున వేరే నంబర్ నుంచి ఫోన్ చేసి, మెడికల్ లీవ్ ఇవ్వాలని కోరాడని తెలిపారు. అనంతరం జైళ్ల శాఖకు మెయిల్ ద్వారా మార్చి 23 నుంచి ఏప్రిల్ 11 వరకు సెలవు ఇవ్వాలని లేఖ పంపించారని తెలిపారు. ఆయన కుటుంబం కూడా అందుబాటులో లేదని అన్నారు. సుబ్బారెడ్డి మెడికల్ లీవ్ శుక్రవారంతో ముగిసింది. ఆయన విధులకు రాగానే సమాచారం ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్‌కు విశాఖ పోలీసులు సూచించారని సమాచారం.

ఎవరీ సుబ్బారెడ్డి..?

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ నియోజకవర్గంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి జైళ్ల శాఖలో 2010 డిప్యూటీ జైలర్‌గా ఉద్యోగంలో చేరాడు. 2019లో జైలర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. గుంటూరు జిల్లా గురజాల సబ్ జైలు జైలర్‌గా పనిచేస్తున్న సమయంలో అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు పరిపాలనా విభాగానికి ఈ ఏడాది జనవరి 27న డెప్యుటేషన్‌పై పంపించారు. ఫిబ్రవరి 1న అనంతపురం ఓపెన్‌ఎయిర్ జైలులో విధుల్లో చేరారు..



కణేకల్లులో దెబ్బతిన్న వరిపంట

ఈదురుగాలుల బీభత్సం..!

- 1050.47 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- రూ.10.29 కోట్ల నష్టం (వివరాలు 6లో..)

బాలికపై అత్యాచారం

6

నేడే ఇంటర్ ఫలితాలు

విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ

మనమిత్ర నంబర్ ద్వారా వాట్సాప్‌కు ఫలితాలు 7

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గురుప్రసాద్

ప్రధాన కార్యదర్శిగా వెంకటరాముడు



గురుప్రసాద్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటరాముడు ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 805 సభ్యులు ఉండగా 635 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అసోసియేషన్‌లో ఏడు స్థానాలకుగాను రెండు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన ఐదు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. గత ఏడాది జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన గురుప్రసాద్, మరోసారి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి మల్లికార్జునపై ఆయన 166 ఓట్ల మెజార్టీ సాధించారు. వెంకటరాముడు తన సమీప ప్రత్యర్థి రాజీవ్‌రెడ్డిపై 65 ఓట్ల మెజార్టీ సాధించారు. ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ధర్మసింగ్ నాయక్ తన సమీప ప్రత్యర్థి శ్రీనివాసరెడ్డిపై 165 ఓట్ల తేడాతో గెలుపొందారు. కోశాధికారి వెంకటరఘుకుమార్ తన సమీప ప్రత్యర్థి మల్లికార్జున శర్మపై 49 ఓట్ల తేడాతో గెలిచారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ విజయభాస్కర్ తన సమీప ప్రత్యర్థి ప్రణీత్‌కుమార్‌పై 196 ఓట్ల తేడాతో గెలుపొందారు. విజేతలకు న్యాయవాదులు పూలమాలలు వేసి అభినందించారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల

ప్రత్యేక దృష్టి

డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీ దేవి

అనంతపురం టౌన్, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అప్పుడే మాతాశిశు మరణాలను నివారించగలమని డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీ దేవి పేర్కొన్నారు. జిల్లా కార్యాలయంలో గత నెలలో జిల్లాలో సంభవించిన మాతాశిశు మరణాలపై సంబంధిత డాక్టర్లు, సిబ్బందితో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. మరణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. మాతాశిశుమరణాల నివారణకు అనేక పథకాలు, వైద్యసేవలు అందుబాటులోకి వచ్చినా.. నేటికీ మరణాలు జరుగుతుండటం బాధ కలిగిస్తోందన్నారు. హైరిస్క్ గర్భిణులుగా గుర్తించిన తర్వాత వారు ప్రసవించే వరకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఇంకా కొందరు నిర్లక్ష్యం చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో డీఐఓ డాక్టరు యుగంధర్, వైద్యులు శ్రీనివాసులు, అరుణలత, బాబ్‌జాన్, హెచ్‌ఓ లక్ష్మన్న, వివిధ పీహెచ్‌సీల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కూలి పనులకు వెళ్లి మృత్యువాత

కడప జిల్లా బలపనూరు వద్ద రోడ్డు ప్రమాదం

యాడికి వాసి దుర్మరణం



వెంకటరాముడు (ఫైల్)

యాడికి, ఏప్రిల్11(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన వెంకటరాముడు (32) కడప జిల్లాకు కూలి పనులకు వెళ్లి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఓబులాపురం గ్రామస్తులు తెలిపిన వివరాలమేరకు.. వెంకటరాముడు అరటికాయలు కోసే కూలి పనులకు కడప జిల్లాకు వెళ్లాడు. శుక్రవారం అక్కడ ద్విచక్రవాహనంలో పనికి వెళ్తుండగా బలపనూరు వద్ద జాతీయ రహదారిపై వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో వెంకటరాముడు అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటరాముడు మృతదేహాన్ని పులివెందుల ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. వెంకటరాముడుకు భార్య మాధవి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి మృతి



బాబు (ఫైల్)

రామగిరి, ఏప్రిల్ 11(ఆంధ్ర జ్యోతి): మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన టీడీపీ మైనార్టీసెల్ మండల కోశాధికారి బాబూ(45)శుక్రవారం మృతి చెందారు. కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపిన మేరకు... కొండాపురం గ్రామానికి చెందిన బాబు పని నిమిత్తం కర్ణాటకలోని తిరుమణికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తిమ్మాపురం గ్రామ సమీపంలో రాత్రి బైకు అదుపుతప్పి రోడ్డు పక్కన గల గుంతలోకి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయన లేవలేక తెల్లవారే వరకు అక్కడే ఉన్నాడు. తెల్లవారుజామున అటువైపు కూలి పనులకు వెళ్తున్న స్థానికులు చూసి, బాధితుడి కుటుంబసభ్యులకు తెలియజేశారు. బాబును పావగడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య సపూరా, కుమారులు ఇర్షాన్, బాబు ఉన్నారు. మండలానికి చెందిన టీడీపీ నాయకులు పలువురు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కుక్కల బెడదను తగ్గించేందుకు చర్యలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామాల్లో కుక్కల బెడదను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి సూచించారు. స్థానిక పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలోని తన చాంబర్‌లో పంచాయతీ అధికారులు, మెడికల్ అధికారులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. పంచాయతీలను క్లస్టర్లుగా విభజించి, ఒక్కో పంచాయతీకి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, గ్రామస్థాయి పంచాయతీ అధికారి, మెడికల్ ఆఫీసర్‌ను అప్రమత్తం చేయాలన్నారు.

ఈదురుగాలుల బీభత్సం..!

● 1050.47 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు ● రూ.10.29 కోట్ల నష్టం ● నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

అనంతపురం అర్బన్/నెట్‌వర్క్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. జిల్లాలోని కంబదూరు, కళ్యాణదుర్గం, కూడేరు, బ్రహ్మసముద్రం బెలుగుప్ప, ఉరవకొండ, కుందుర్పి, రాయదుర్గం శెట్టూరు, కణేకల్లు, గుమ్మఘట్ట మండలాల్లో 131.47 హెక్టార్లలో రూ.3.15 కోట్ల విలువైన అరటి, మామిడి, బొప్పాయి, చీనీ, దానిమ్మ, కర్బూజ తదితర పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయశాఖ పరంగా రాయదుర్గం, గార్లదిన్నె, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, బెలుగుప్ప, డి. హిరేహాళ్ మండలాల్లో 919 హెక్టార్లలో రూ.7.14 కోట్ల విలువైన మొక్కజొన్న, వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 1050.47 హెక్టార్లలో రూ. 10.29 కోట్ల విలువైన వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. కోతదశలోని పంటలు దెబ్బతినడంతో బాధిత రైతులు గుండెలు బాదుకుంటున్నారు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

11 మండలాల్లో వర్షం



కూడేరు మండలంలో నేలకొరిగిన అరటి చెట్లను చూపుతున్న రైతు వెంకటనారాయణ

జిల్లాలోని 11 మండలాల్లో గురువారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా ఆత్మకూరులో 35.4 మి.మీ, వర్షపాతం నమోదైంది. బొమ్మనహాళ్ 30.0, గుమ్మఘట్ట 28.8, బ్రహ్మసముద్రం 15.0, శెట్టూరు 14.6, కణేకల్లు 13.2, డి. హిరేహాళ్ 11.8, కళ్యాణదుర్గం 8.6, కూడేరు 7.6, తాడిపత్రి 7.2, శింగనమల 4.2 మి.మీ, వర్షపాతం నమోదైంది. శుక్రవారం జిల్లాలోని పలుప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కూడేరు, బొమ్మనహాళ్, గార్లదిన్నె మండలాల్లో ఓ మోస్తారు వాన పడింది. యాడికి , గుత్తి, ఉరవకొండ మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీశాయి.

అరటి పంట నేలమట్టం

కళ్యాణదుర్గం రూరల్ మండలంలో ఈదురుగాలతో కూడిన వర్షానికి అరటితోట నేల మట్టమైంది. మండలంలోని పాలవెంకటాపురం గ్రామంలో రైతు వెంకటేశులుకు చెందిన ఐదెకరాల్లో అరటి పంట నేలమట్టమైంది. పంట చేతికొచ్చిన సమయంలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షానికి పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు బాధిత రైతు వాపోయాడు. రూ.10 లక్షలకుపైగా పంటనష్టం జరిగిందని బాధిత రైతు ఆవేదన చెందాడు. ప్రభుత్వం పంటనష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నాడు. అలాగే కళ్యాణదుర్గం రూరల్ పరిధిలోని మల్లికార్జునపల్లికి చెందిన రైతు బడప్పకు చెందిన ఐదెకరాల్లో మొక్కజొన్న పంట నేలమట్టమైంది. పంట కోత సమయంలో ఈదురుగాలులకు పంట పూర్తిగా దెబ్బతినడంతో రూ.4 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.



బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లి వద్ద నేలకూలిన బొప్పాయి పంట

కూడేరు మండలంలో..

ఈదురు గాలులకు మండలంలో అరటి పంట నేలకొరిగింది. మామిడి తోటల్లో కాయలు రాలిపడ్డాయి. మండలంలోని చోళసముద్రం, మరుట్ల, ఎంఎంహళ్లి, కడదరకుంట, జయపురం తదితర గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షానికి అరటి, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. కోతదశలోని అరటి ఈదురుగాలులకు నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చోళసముద్రం గ్రామానికి చెందిన రైతు వెంకటనారాయణ సాగుచేసిన ఐదున్నర ఎకరాల్లో అరటి పంటను నాలుగు రోజుల్లో కోయాల్సి ఉండగా.. ఈదురుగాలులకు దెబ్బతింది. కడదరకుంటకు చెందిన గుడిపూటి సురేష్‌కు చెందిన మామిడితోటలో కాయలు నేలరాలడంతో తీవ్ర నష్టం వాటిల్లింది.

మామిడి నేలపాలు..

కుందుర్పి మండలంలోని పలు గ్రామాల్లో మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సారి అరకొరగా వచ్చిన దిగుబడి కూడా ఈదురుగాలులకు నేలరావడంతో బాధిత రైతుల గగ్గోలు పెడుతున్నారు.

పడిపోయిన విద్యుత్ స్తంభాలు

బ్రహ్మసముద్రం మండలంలో గురువారం రాత్రి గాలివాన బీభత్సానికి అరటి, బొప్పాయి, మొక్కజొన్న, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో ప్రజలు అంధకారంలో గడపాల్సి వచ్చింది. నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సందీప్‌కు చెందిన అరటి తోట నేలకొరిగింది. సంతేకొండాపురం, తీటకల్లు, యాటకల్లు, రాయలప్ప దొడ్డి గ్రామాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. గుండిగానిపల్లిలో బొప్పాయి పంట నేలమట్టమైంది.

బెళుగుప్పలో..

మండలంలో గురువారం రాత్రి ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. నరసాపురంలో 50 ఎకరాలు, రమణేపల్లిలో 35 ఎకరాల్లో మొక్కజొన్న, నాలుగెకరాలల్లో అరటి, దుద్దేకుంటలో 20 ఎకరాల్లో మొక్కజొన్న, బెలుగుప్పలో పదెకరాల్లో మొక్కజొన్న, యలగలవంకలో నాలుగెకరాల్లో బొప్పాయి, గుండ్లపల్లిలో నాలుగెకరాల్లో మొక్కజొన్న, గంగవరంలో 8 ఎకరాల్లో అరటి, అంకంపల్లిలో 4 ఎకరాల్లో అరటి పంటలు దెబ్బతిన్నాయి.



రాయదుర్గం మండలంలో పడిన వడగండ్లు



కూడేరు మండలంలో నేలరాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న అధికారులు



బెళుగుప్ప మండలం నరసాపురంలో నేలవాలిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు రవికుమార్

ముంచిన వడగండ్ల వాన

బొమ్మనహాళ్ మండలంలో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చింది. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, చెట్లు నేలకూలాయి. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. బొమ్మనహాళ్ మండల కేంద్రంతో పాటు శ్రీధరఘట్ట, గోనేహాళ్, దేవగిరి, ఉప్పరహాళ్, సింగానహళ్లి ఉద్దేహాళ్, లింగదహాళ్, రంగాపురం క్యాంపు గ్రామాల్లో వరి, పత్తి, అరటి, మామిడి, దానిమ్మ పంటలు దెబ్బతిన్నాయి. వడగండ్ల వాన పడటంతో వేల ఎకరాల్లో వరి ధాన్యం గింజలు రాలిపోయాయి. గోనేహాళ్, శ్రీధరఘట్ట గ్రామాల్లో చేతికందే దశలో వరి ధాన్యం గింజలు నేలపాలయ్యాయని బాధిత రైతులు, బలరాంరెడ్డి, జగన్నాథ్ రెడ్డి, బండూరు మల్లికార్జున, దాసరి ధనంజయ, కేశవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం

కణేకల్లు మండలంలోని పలు గ్రామాల్లో 433 హెక్టార్లల్లో వరి పంట, 231 హెక్టార్లల్లో మొక్కజొన్న, 75 హెక్టార్లలో పత్తి పంటలు దెబ్బతిన్నాయి.

రాయదుర్గంలో..

మండలంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి భారీగా పంటనష్టం జరిగింది. రాయదుర్గం మండలంలోని జుంజురంపల్లి, నాగిరెడ్డిపల్లి, వేపరాల, ఆవులదట్ల, వడ్రవన్నూరు, కెంచానపల్లి, కొండాపురం, వీరాపురం మరియు బాగినాయకనహళ్లి గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. మండలంవ్యాప్తంగా 220 మంది రైతులకు చెందిన 307 హెక్టార్లలో రూ.26 లక్షల విలువైన మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

ఉద్యాన పంటలకు భారీ నష్టం

రాయదుర్గం రూరల్ మండలంలోని కదరంపల్లి, ఆవులదట్ల, వేపరాల, నాగిరెడ్డిపల్లి, రేకులకుంట తదితర ప్రాంతాల్లో సాగుచేసిన ఉద్యాన పంటలు ఈదురుగాలులకు నేలకొరిగాయి. దీంతో అపార నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. ఆవులదట్ల గ్రామానికి చెందిన రైతు ధర్మనాయక్ మామిడి తోటలో కాయలు నేలపాలయ్యాయి. అదే రైతుకు చెందిన ఫాంహౌస్ రేకులు గాలికి ఎగిరిపోయాయి. తద్వారా రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. రేకులకుంట గ్రామానికి చెందిన రైతు సీతారాంరెడ్డికి చెందిన నాలుగెకరాల్లో చీనీ మొక్కలు నేలకొరిగాయి. బొప్పాయి 37 ఎకరాలు, అరటి 17 ఎకరాలు, గుమ్మడికాయ 8 ఎకరాలు, చీనీచెట్లు మూడెకరాల్లో పంట పూర్తిగా దెబ్బతినడంతో దాదాపు రూ.35 లక్షల వరకు పంటనష్టం వాటిలినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.



కణేకల్లులో దెబ్బతిన్న వరిపంట



కల్యాణం.. వైభోగం

రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.



కళాకారుల నృత్యం



పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు

ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



ఎదుర్కోలు దృశ్యం

సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

బాలికపై అత్యాచారం



ఆస్పత్రిలో వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్ఐ

నార్పల, ఏప్రిల్ 11(ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలో పన్నెండేళ్ల బాలికపై శుక్రవారం సాయంత్రం మహేష్ అనే యువకుడు అత్యాచారం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు, బుక్కరాయసముద్రం మండలం సంజీవపురం గ్రామానికి చెందిన మహేష్. గొర్రెల ఎరువు కోసం నార్పలకు వచ్చాడు. ఆ ఇంటి వద్ద బాలిక ఒంటరిగా ఆడుకుంటూ కనిపించింది. దీంతో బలవంతంగా ఇంట్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేశాడు. బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలు తన తాతకు ఫోన్ చేసి సమాచారం తెలియజేసింది. కుటుంబ సభ్యులు బాలికను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కౌలుట్లయ్య సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మహేష్‌ను పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోక్సో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

బంగారం వ్యాపారి ఆత్మహత్య

పోలీస్ స్టేషన్ ఎదుట రసాయనం తాగిన గౌసుల్లా

తాకట్టు బంగారాన్ని కొనుగోలు చేయడంతో వివాదం



గౌసుల్లా (ఫైల్)

తాడిపత్రి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట బంగారం దుకాణ నిర్వాహకుడు గౌసుల్లా(46) శుక్రవారం రసాయనం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తాకట్టు బంగారాన్ని కొనుగోలు చేసిన వివాదంలో పోలీసులు, మరికొందరు వేధించడంతో గౌసుల్లా ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ గోల్డ్‌లోన్ కంపెనీలో మహమ్మద్ రఫీ అనే వ్యక్తి పది తులాల బంగారాన్ని తాకట్టుపెట్టి 2023 డిసెంబరులో రుణం తీసుకున్నాడు. దీనికి అదే కంపెనీలో పనిచేస్తున్న అతని స్నేహితుడు జిలాన్‌బాషా సాయం చేశాడు. ఆ తరువాత రఫీకి తెలియకుండా తాకట్టు బంగారాన్ని జిలాన్ బాషా అమ్మేశాడు. 'వేలానికి వచ్చిన బంగారం.. తక్కువ ధరకు ఇప్పిస్తా' అని చెప్పి గౌసుల్లాకు విక్రయించాడు. సరిగ్గా ఏడాది తరువాత తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకునేందుకు జిలాన్ బాషాను రఫీ సంప్రదించాడు. అతను స్పందించకుండా కాలం గడిపి, రెండు నెలల క్రితం ఊరు విడిచి వెళ్లిపోయాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తానే గాలించి, బళ్లారిలో ఉన్న జిలాన్‌బాషాను పట్టుకువచ్చి రెండు రోజుల క్రితం పోలీసులకు అప్పగించాడు. బంగారాన్ని గౌసుల్లాకు విక్రయించానని జిలాన్‌బాషా చెప్పడంతో పోలీసులు గౌసుల్లాను పిలిపించారు. వేలంలో అమ్ముతున్నారని జిలాన్ చెప్పడంతో తాను మూడు తులాల బంగారాన్ని కొనుగోలు చేశానని, డబ్బులు అప్పుడే చెల్లించానని గౌసుల్లా పోలీసులకు తెలిపాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా గౌసుల్లాను పోలీసులు స్టేషన్‌కు పిలిపించడం, గౌసుల్లా ఇంటి వద్దకు మహమ్మద్ రఫీ, పోలీసులు వెళ్లడం వంటి సంఘటనలు జరిగాయి. ఎస్ఐ గౌస్‌బాషా శుక్రవారం ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించారు. పది తులాల బంగారంతో తనకు సంబంధం లేదని, కొన్నది మూడు తులాలేనని, డబ్బులు కూడా ఇచ్చేశానని గౌసుల్లా చెప్పినా సమస్య పరిష్కారం కాలేదు. ఏదైనా ఉంటే బయటకు వెళ్లి మాట్లాడుకోవాలని ఎస్ఐ సూచించారు. దీంతో స్టేషన్ బయటకు వెళ్లిన గౌసుల్లా.. తన ద్విచక్రవాహనంలో ఉన్న రసాయనం బాటిల్‌ను తీసుకుని తాగేశాడు. వెంటనే పోలీసులు, స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గౌసుల్లా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అతని బంధువులు పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. పోలీసుల వేధింపుల కారణంగానే గౌసుల్లా ఆత్మహత్య చేసుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌసుల్లాకు భార్య తస్లీమ్, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గౌసుల్లా కుమారుడు నజీరుద్దీన్ ఫిర్యాదు మేరకు మహమ్మద్ రఫి, అతని తమ్ముడు హాజీ, జిలాన్ బాషాపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



తాడిపత్రి పోలీస్ స్టేషన్ వద్ద గౌసుల్లా కుటుంబ సభ్యులు, బంధువులు

మట్టి పెల్లలు విరిగిపడి ముగ్గురు చిన్నారుల మృతి..?

మలయనూరు చెరువులో అనుమానాస్పద ఘటన

బాధితులు బొగ్గులు కాల్చే మహారాష్ట్ర కుటుంబాలు

గుట్టుచప్పుడు కాకుండా తరలించిన ఏజెంట్..?

ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు



మహారాష్ట్ర కూలీలను విచారిస్తున్న ఎస్ఐ నగేష్

కుందుర్పి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మలయనూరు సమీపంలో మట్టి పెల్లలు విరిగిపడి ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని విశ్వసనీయంగా తెలిసింది. గ్రామ సమీపంలోని చెరువులో మహారాష్ట్రకు చెందిన 15 కుటుంబాలు బొగ్గులు కాల్చే పని చేస్తున్నారు. కొన్ని నెలలుగా వారు అక్కడే గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. పెద్దలు గురువారం పనిలో నిమగ్నమై ఉండగా, చిన్నారులు ఆడుకునేందుకు చెరువులోని గుంతల్లోకి వెళ్లారని, వారిపై మట్టి పెల్లలు విరిగిపడ్డాయని తెలిసింది. మట్టిలో కూరుకుపోయిన జ్యోతి (14), మార్వత్(10), అనీత్(9) మృతిచెందారని, బార్క్(11) అనే చిన్నారి తీవ్రంగా గాయపడ్డారని తెలిసింది. చెరువులో ఇసుక తవ్వకాల కారణంగా ఏర్పడిన గోతులే ప్రమాదానికి కారణమని తెలిసింది. శ్రీకాంత్ రాథోడ్ అనే బొగ్గుల ప్రధాన ఏజెంట్ మహారాష్ట్ర నుంచి ఆ కుటుంబాలను ఇక్కడికి తీసుకువచ్చి పని కల్పించారని సమాచారం. మృతి చెందిన ముగ్గురు చిన్నారులు విలాస్ అనే వ్యక్తి సంతానమని తెలిసింది. విషయం తెలుసుకున్న ప్రధాన ఏజెంట్, బాధిత కుటుంబాలను, చిన్నారుల మృతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా సొంత వాహనంలో మహారాష్ట్రకు తీసుకెళ్లినట్లు తెలిసింది. తీవ్రంగా గాయపడ్డ చిన్నారి బార్క్(11)ను బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రితో చేర్పించారని తెలిసింది. విషయం తెలుసుకున్న మలయనూరు గ్రామస్థులు, పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి విచారించారు. అక్కడున్నవారు సరైన సమాచారం ఇవ్వలేదు. ఎస్ఐ నగేష్ తమ సిబ్బందితో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్న ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. బొగ్గులు కాల్చే పనిలో ఉన్న కూలీలను విచారించారు. ఎవరి నుంచీ సరైన సమాచారం లభించడం లేదని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్ఐ నగేష్ తెలిపారు.



ప్రమాదం జరిగినట్లు భావిస్తున్న ప్రాంతం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం ఫైనాన్షియల్ హబ్‌గా ఎదగాలి

జోయాలుకాస్ జ్యుయలర్స్ ప్రారంభోత్సవంలో వక్తలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఫైనాన్షియల్ హబ్‌గా అభివృద్ధి చెందాలని వక్తలు ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని రాజు రోడ్డులో జోయాలుకాస్ జ్యువెలర్స్ 102వ షోరూమ్‌ను శుక్రవారం వారు అట్టహాసంగా ప్రారంభించారు. కార్యక్రమానికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, జోయాలుకాస్ ఎండీ, సీఈఓ జోయాలుకాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకీ జిల్లాలో పెద్ద పెద్ద కంపెనీలకు చెందిన షాపింగ్‌మాల్స్ పెరుగుతున్నాయని, ఇదే పంథాల్లో జిల్లా ఫైనాన్షియల్ హబ్‌గా ఎదిగి, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలని ఆకాంక్షించారు. ఎండీ జోయాలుకాస్ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జ్యువెలరీ జోయాలుకాస్ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే అనంతపురంలో ఒక షోరూమ్ ఉందని, ఇపుడు రెండో షోరూమ్‌ను ప్రారంభించామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కలిగిన అనేక రకాల ఆభరణాలను ఈ షోరూమ్‌లో అందుబాటులో ఉంచామని అన్నారు. వెండి, బంగారం, వజ్రాలలో అధునాతన ఆభరణ శ్రేణి తమ వద్ద లభిస్తాయని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో ఆభరణాలను విక్రయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జోయాలుకాస్ సంస్థ ఈడీలు ఆంటోని జోస్, థామస్ మాథివ్, హెన్రీ జార్జ్ తదితరులు పాల్గొన్నారు.


షోరూంలో అతిథులు

హంద్రీనీవాకు లైనింగ్ తగదు

వెడల్పు చేయాలి

6 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో సమాంతర కాలువ తవ్వాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

గుంతకల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కింద కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరిచ్చిన తర్వాత, అవసరమైతే మిగతా కాలువకు లైనింగ్ చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ పేర్కొన్నారు. మండలంలోని జీ కొట్టాల వద్ద హంద్రీనీవా వెడల్పు పనులను శుక్రవారం సీపీఐ నాయకులు పరిశీలించారు. హంద్రీనీవా రెండో దశ కాలువను వెడల్పు చేయకుండా లైనింగ్ చేయాలని నిర్ణయించడం సబబుకాదన్నారు. లైనింగ్ చేస్తే భూగర్భ జలాలు అడుగంటి, రైతులు నష్టపోతారన్నారు. హంద్రీనీవా వైడెనింగ్ చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. లైనింగ్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. హంద్రీనీవా 1, 2 దశల కాలువ కింద నీరివ్వడంతో పాటు జీబీసీ పరిధిలోని ఉపకాలువల ఆయకట్టుకు, భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని చెరువులకు నీరివ్వాలని కోరారు. కాలువలో 3,800 క్యూసెక్కుల ప్రవాహంతో నీరు పూర్తిస్థాయిలో ఇవ్వడం సాధ్యం కాదన్నారు. కాలువ సామర్థ్యాన్ని మరో వెయ్యి క్యూసెక్కులకు పెంచాలనీ, 6 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో సమాంతర కాలువ నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో హంద్రీనీవా పిల్ల కాలువల నిర్మాణం పూర్తిచేసి, ఆయకట్టును అభివృద్ధి పరచి నీరివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, మహమ్మద్ గౌస్, రాయల్ రాము, దేవేంద్ర, దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు.


హంద్రీనీవా కాలువ పనులను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

నేడే ఇంటర్ ఫలితాలు

విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ

మనమిత్ర నంబర్ ద్వారా వాట్సా‌ప్‌కు ఫలితాలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాలు శనివారం విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు ప్రకటన విడుదల చేసింది. గతనెల 1 నుంచి 15వతేదీ వరకూ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 63 పరీక్షా కేంద్రాలకు 48,690 మంది విద్యార్థులను కేటాయించారు. మొదటి ఏడాది 25,730 మంది, రెండో ఏడాది 22,960 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో చాలామంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటల తర్వాత ఫలితాలు అందుబాటులో ఉంటాయని బోర్డు ప్రకటించింది. విద్యార్థులు తమ ఫలితాలను http://results-bie.ap.gov.in వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చు. మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009కు హాయ్ అని మెసేజ్ చేసి, ఫలితాలు పొందవచ్చునని బోర్డు ప్రకటించింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది.

చీనీకాయలు టన్ను రూ.22 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,200, కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1406 టన్నుల చీనీకాయలు వచ్చాయని పేర్కొన్నారు.

ఈ- శ్రమ్‌లో నమోదు చేయండి

కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. దీనిపై కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ.. జిల్లాలో అర్హత గల అన్నిరంగాల కార్మికులను ఈ పోర్టల్ నమోదు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు ఈకార్మికులకు అందేలా చూడాలన్నారు. ఉపాధికూలీలు, అంగన్వాడీ వర్కర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు, ప్లాన్ అప్రూవల్ అథారిటీలందరూ ప్రతినిర్మాణంపై మొత్తం వ్యయంలో ఒకశాతం సెస్ వసూలు చేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు జమ చేయాలన్నారు. బాలకార్మికుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంత భేష్..!

సొసైటీల కంప్యూటరీకరణలో ఉమ్మడి జిల్లాకు ద్వితీయ స్థానం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సొసైటీల కంప్యూటరీకరణలో రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాకు ద్వితీయ స్థానం దక్కింది. 108 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీ) కంప్యూటరీకరణ పూర్తిచేసుకున్న సందర్భంగా జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) అరుణకుమారి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖారాణి శుక్రవారం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్, ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి శివ నారాయణశర్మను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సొసైటీలను బలోపేతం చేయాలని సూచించారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల సహకార శాఖాధికారులు అరుణకుమారి, కృష్ణానాయక్, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖారాణిని అభినందించారు. కార్యక్రమంలో డీఎస్‌సీఓ ప్రభాకర్ రెడ్డి, సహకార శాఖ, ఏడీసీసీ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.


కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను సన్మానిస్తున్న డీసీఓ, సీఈఓ

రైతు కష్టాన్ని కాజేశారు

కందుల డబ్బు సైబర్ నేరగాళ్ల పాలు


బాధిత రైతు నిర్మల

బెళుగుప్ప, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రైతు కష్టాన్ని సైబర్ నేరగాళ్లు కాజేశారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి, ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్మగా వచ్చిన సొమ్మును అప్పనంగా దోచేశారు. మండల కేంద్రానికి చెందిన మహిళా రైతు నిర్మలమ్మ బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు ఈనెల 9న మూడు విడతల్లో రూ.99,400 కాజేశారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆమె ఫిర్యాదు చేశారు. రైతు పండించిన 17 క్వింటాళ్ల కందులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. అందుకు సంబంధించిన డబ్బు ఈనెల 9వ తేదీన రాత్రి ఆమె బ్యాంకు ఖాతాకు జమైంది. ఆ రాత్రే ఓ ఆమె ఫోన్‌కు సైబర్ నేరగాళ్ల నుంచి మెసేజ్ వచ్చింది. అదేదో తెలియని ఆమె దానిపై క్లిక్ చేసింది. అంతే.. ఆ తరువాత మూడు విడతల్లో రూ.24,500, రూ. 24,900, రూ.50వేలు మొత్తంగా రూ.99,400 సైబర్ నేరగాళ్లు కాజేశారు. విషయం తెలియని మహిళా రైతు ఈనెల 10న ఉదయం డబ్బు డ్రా చేసుకునేందుకు బ్యాంకుకెళ్లారు. అక్కడ విషయం తెలిసింది. దీనిపై బాధితురాలు.. సైబర్ సెల్ 1930 నంబర్, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

10న జాతీయ లోక్ అదాలత్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మే 10న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ అన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని కోర్టులలో ఈ జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తారన్నారు. మోటారు వాహనాల ప్రమాద భరిత కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్సు కేసులు, కుటుంబ తగాదాలు(విడాకుల కేసులు కాకుం డా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగిన క్రిమినల్ కేసు లు, వినియోగదారుల ఫోరం కేసులు, పంచాయతీ, మున్సిపల్ టాక్స్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేస్తామన్నారు. కక్షిదారులందరూ జాతీయయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని తెలిపారు.

ఆర్థిక అవకతవకలపై నివేదిక ఇవ్వండి

అవకతవకలపై నివేదికలు ఇవ్వాలి

ఆడిటర్లకు డీసీఓ ఆదేశాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు, సొసైటీల్లో ఆర్థిక వ్యవహారాలను నిశితంగా పరిశీలించి, అవకతవకలపై నివేదిక ఇవ్వాలని జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) అరుణకుమారి.. ఆడిటర్లను ఆదేశించారు. సొసైటీల కంప్యూటరీకరణ, ఆన్‌లైన్ లావాదేవీలు, ఆడిట్‌పై శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ సహకార భవన్ ఆవరణలోని డీసీఏఓ కార్యాలయంలో డీసీఓ సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సొసైటీల ఆడిట్ ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని సూచించారు. సహకార సంఘాల్లో ప్రతి రికార్డును క్షుణ్ణంగా పరిశీలించి, అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీసీఏఓ ప్రభాకర్ రెడ్డి, సహకార శాఖ ఆడిటర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీఓ అరుణకుమారి

న్యూస్ బాక్స్

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



బాధితురాలికి చెక్కు ఇస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గుమ్మఘట్ట మండలం తాళ్లకేరకు చెందిన సరస్వతికి రూ.81వేలు సీఎంఆర్ ఎఫ్ చెక్కును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అందజేశారు. శుక్రవారం అనంతపురం నగర శివారులోని ఆయన నివాసంలో బాధితురాలికి చెక్కును అందజేశారు.

పోలీసులకు జగన్ క్షమాపణ చెప్పాలి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో పర్యటన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని పోలీసులకు క్షమాపణ చెప్పాలని బీజేపీ రాప్తాడు అసెంబ్లీ కన్వీనర్ రావి చైతన్య కిషోర్ డిమాండ్ చేశారు. బట్టలూడదీస్తామని వ్యాఖ్యానించిన ఆ యూనిఫాం వేసుకున్న ఉద్యోగులే నిరంతరం రక్షణ కల్పిస్తున్నారన్న విజ్ఞత జగన్‌రెడ్డికి లేదన్నారు. రాజకీయ ఉనికికోసం ప్రభుత్వ ఉద్యోగులను కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. సమాజరక్షణ కోసం పనిచేస్తున్న ఖాకీచొక్కాను అగౌరవపరిస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు.

దేవుడి పని శ్రద్ధగా చేయాలి

అనంతపురం రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దేవుడి పని శ్రద్ధగా చేస్తే ఆయన మనల్నిపోషిస్తాడని మండపేట మినిస్ట్రీస్ పాస్టర్ ధర్మవీర్‌పాల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాచానపల్లి యేసుకృపా మందిరంలో జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగీకులుగా మండపేట మినిస్ట్రీస్ పాస్టర్ ధర్మవీర్‌పాల్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మార్క్, మనష్షే, జీవన్‌బాబు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని ఫిర్యాదు

గార్లదిన్నె, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుంపల్లిలోని టీడీపీకి చెందిన బిల్లా వెంకటేష్ కుటుంబం నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని ఆదే గ్రామానికి చెందిన ప్రసాద్ అనే టీడీపీ కార్యకర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం టీడీపీ కార్యకర్త ప్రసాద్ ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషాను కలిశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. బిల్లా వెంకటేష్ కుటుంబ సభ్యులు గ్రామంలోని ప్రభుత్వం భూమిని ఆక్రమించుకునేందుకు బోరు వేశారని అన్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో బోరును సీజ్ చేస్తామని నోటీసులు ఇచ్చారన్నారు. దీంతో బిల్లా వెంకటేష్, కుటుంబ సభ్యులు తనకు ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దుషించారని, బెదిరింపులకు దిగుతున్నారని ప్రసాద్ ఆరోపించారు. ఎస్ఐ విచారణ చేసి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారని అన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):మండలంలోని బసంపల్లికి చెందిన శంకరనారాయణ(50) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందాడు. ఇంటిలో ఉన్నపలంగా గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ధర్మవరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్టు పార్టీ నాయకులు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్ మెయింటెనెన్స్‌లో భాగంగా శనివారం నగరంలో ని పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ టౌన్-1 డీఈఈ చంద్రశేఖర్, టౌన్-2 డీఈఈ శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని హౌసింగ్ బోర్డు, విద్యుత్‌నగర్, లక్ష్మీనరసయ్యకాలనీ, హమాలీకాలనీ, అరవిందనగర్, నాయక్‌నగర్, ఆదర్శనగర్, సెవెన్ హీల్స్ కాలనీ, ఆర్టీఓ ఆఫీస్, భైరవనగర్, ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ ఏరియా, జడ్పీఆఫీస్, ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్, రామచంద్రనగర్, రైల్వేస్టేషన్ ఏరియా, శ్రీనివాసనగర్, రెవెన్యూకాలనీ, సంగమేష్‌నగర్ సర్కిల్, ఎక్సైజ్ కాలనీ, వినాయకనగర్, పాతవూరు ప్రాంతాల్లో ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా ఉండదన్నారు. టౌన్-2 సబ్ డివిజన్ పరిధిలోని వేణుగోపాల్ నగర్, రాణినగర్, భాగ్యనగర్, గుత్తిరోడ్డు, శ్రీనగర్‌కాలనీ, ఎస్‌బిఐకాలనీ, 80ఫీట్ రోడ్డు, ద్వారకనగర్, బళ్లారిరోడ్డు, తపోవనం, స్టాలిన్‌నగర్, లెనిన్‌నగర్, పాపంపేట ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● రాప్తాడు : మండలంలోని హంపాపురం సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ శివప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ రాప్తాడు, గంగలకుంట, అయ్యవారిపల్లి, లింగనపల్లి, గాండ్లపర్తి, ప్రసన్నాయపల్లి, హంపాపురం, గొందిరెడ్డిపల్లి, పుల్లలరేవు, రామినేపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● గార్లదిన్నె : మండల పరిధిలోని కొప్పలకొండ, యర్రగుంట్ల, కమలాపురం, కొట్టాలపల్లి, సంజీవపురం, ముకుందాపురం, పెనకచెర్ల గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా అంతరాయం ఉన్నట్లు విద్యుత్ శాఖ ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు.

వాహనాల తనిఖీ

గార్లదిన్నె, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లఘించి నడుపుతున్న వివిధ వాహనాలపై పోలీసులు, ఆర్టీఏ అధికారులు కొరడా ఝులిపించారు. శుక్రవారం మండల పరిధిలోని తలగాసిపల్లి క్రాస్ సమీపంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. కూలీల ను తరలిస్తున్న లగేజీ వాహనాలను ఆపి జరిమానాలు విధించారు. మొత్తం 12 వాహనాలకు రూ. 90,700 జరిమాన విధించారు.

పశువుల తొట్టెల పరిశీలన

కనగానపల్లి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కింద గ్రామ పంచాయతీలలో నిర్మించిన పశువుల నీటితొట్టెలను డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, ఏపీడీ వెంకటచలపతి పరిశీలించారు. కనగానపల్లి, రాంపురం గ్రామాల్లో శుక్రవారం వారు పర్యటించి నీటితొట్టెలతో పాటు ఫాంపాండ్లు, హార్టికల్చర్ పనులను పరిశీలించారు. పాడి రైతులు నీటితొట్టెలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేష్‌నాయక్, టీఏలు నరసింహ, రవినాయక్, నారాయణస్వామి పాల్గొన్నారు.



నీటితొట్టెను పరిశీలిస్తున్న డ్వామా అధికారులు

ఘనంగా జ్యోతిబా పూలే జయంతి



నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



బీసీ సంక్షేమ సంఘం నాయకులు



ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు



మాట్లాడుతున్న ఎస్ఈ శేషాద్రి శేఖర్



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ నాయకులు

(న్యూస్ నెట్‌వర్క్- ఆంధ్రజ్యోతి)

సమాజంలోని అట్టడుగు వర్గాల ఉద్ధరణ కోసం పనిచేసిన గొప్ప నాయకుడు మహాత్మా జోతిబా పూలే అని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖల ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ, ఆ శాఖ సిబ్బంది నాగరత్నమ్మ, సుభాషిణి, రంగమ్మ, గంగాద్రి, మస్తాన్, మారుతీప్రసాద్, రవీంద్ర పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, సీనియర్ నాయకుడు సందిరెడ్డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి నివాళి అర్పించారు. నాయకులు వెంకటేశ్వరరెడ్డి, చక్రధర్ యాదవ్ పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు ఎస్ఆర్ నాగభూషణం, సురేంద్రగౌడ్, సురేష్‌యాదవ్, విష్ణు, భాస్కర్, హనుమంతురావు, హరి పూల మాలలు వేశారు. ఎస్సీఎస్టీ సంఘాల జేఏసీ చైర్మన్ సాకే హరి, హనుమంతు, తిక్కన్న, రామకృష్ణ, నారాయణస్వామి నివాళులర్పిం చారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య నివాళులర్పించారు. బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతా చంద్రమోహన్ ఆధ్వర్యంలో నాయకులు మోతీలాల్, అనంతసేన, శివరుద్రప్ప, చంద్రమునయ్య, చంద్రమౌళి, శ్రీనివాసులు, వేణుగోపాల్, ఆదిమూర్తి, రసూల్, కుళ్లాయప్ప పూల మాలలు వేశారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పూల మాల వేసి నివాళులర్పించారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో నాయకులు గంగారామ్, రాయల్ మురళీ, సరిపూటి రమణ, కూచి హరి, ముక్తియార్, సుధాకర్ యాదవ్, గోపాల్ గౌడ్, బాలాంజినేయులు, లక్ష్మీనరసింహ, ఓంకార్‌రెడ్డి, ఇస్మాయిల్, ఫిరోజ్ అహ్మద్, కృష్ణకుమార్ పాల్గొన్నారు. విద్యుత్‌శాఖ జిల్లా కార్యాలయంలో ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఈఈలు ప్రసాద్, జేవీ రమేష్, రవి శంకర్, ఏఓ రాజశేఖర్, డీఈఈ రామకృష్ణ, ఏఏఓ గంగన్న, జేఏఓ రాము తదితరులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేఎన్టీయూలో రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, దేవన్న, భానుమూర్తి, నాగప్రసాద్ నాయుడు, సత్యనారాయణ, ప్రశాంతి, ఈశ్వర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ సహదేవుడు, బాలాజీ నాయక్, సోమనాథ్, సుధాకర్ పాల్గొన్నారు. బహుజన లాయర్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప, మహేశ్వరి, శ్రీనివాసులు, ప్రమీల, పార్వతి, సాయి నివాళి అర్పించారు. జడ్పీ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య నివాళులర్పించారు. యూటీఎఫ్ నాయకులు లింగమయ్య, రమణయ్య, కోటేశ్వరప్ప, శ్రీనివాసులు పూలమాలలు వేశారు. ఆర్ఈఎఫ్ నాయకులు శ్రీరాములు, మర్రిస్వామి, రాజశేఖర్, రామన్న యాదవ్, పంచాయతీరాజ్ డీఈ అరుణ్‌కుమార్ నివాళి అర్పించారు. కాంగ్రెస్ అనంతపురం ఇన్‌చార్జ్ దాదాగాంధీ పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు



జేఎన్టీయూలో నివాళులర్పిస్తున్న అధికారులు



ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో..



నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అధికారులు



నివాళులు అర్పిస్తున్న డీఈ అరుణ్‌కుమార్ తదితరులు

కమనీయం... సీతారాముల కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు, పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో సీతారాముల తిరుకల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఉదయం సీతారాములకు వివిధ అభిషేకాలు, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని వేదికపై సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో చంద్రప్రభవాహనంపై స్వామివార్లను ఆశీనులు గావించి పురవీధులగుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభ, భక్తమండలి నరేంద్ర చౌదరి, శ్రీనివాసులు చౌదరి, జిజే వేణు, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, హర్ష, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.

● శింగనమల: రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.శుక్రవారం రాత్రి శింగనమల ఆత్మసీతారాముల కల్యాణం రామనామ జపంతో భక్తులు పరవశించిపోతుండగా వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కుటుంబ సభ్యులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. రాత్రి 8.30 గంటలకు తులాలగ్నలో స్వామి వారి కల్యాణం వేదపండితులు ఉత్సవ మూర్తులకు శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచారు. అనంతరం మాంగల్య ధారణ నిర్వహించారు. భక్తులకు టీడీపీ నాయకుడు మారుతినాయుడు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, టీడీపీ నాయకులు ఆదినారాయణ, మారుతినాయుడు, దేగల కృష్ణమూర్తి, షాలిని సత్తి, ఎం.ఆదినారాయణ, సునీత, పసువుల శ్రీరామిరెడ్డి, మాసూల చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ కట్టించుకుని రెన్యువల్ చేయండి

గార్లదిన్నె, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి వడ్డీ కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మొత్తం చెల్లిస్తేనే రెన్యువల్ చేస్తామని బ్యాంకర్లు పెట్టిన ఆంక్షలను నిరసిస్తూ శుక్రవారం మర్తాడు కెనరా బ్యాంకు వద్ద ధర్నా చేశారు. రైతులు అప్పులు ఊబిలో కూరుకుపోయారని, బ్యాంకర్లు ఆంక్షలు పెట్టడం తగదని అన్నారు. వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యువల్ చేయాలని, లేదంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బ్యాంకు మేనేజర్‌కు ఇచ్చారు. ధర్నాలో రైతు సం ఘం నాయకులు చెన్నారెడ్డి, వలి, నారాయణరెడ్డి, నాగార్జునరెడ్డి, రవీంద్ర, ఆదినారాయణ, పీరా, షరీఫ్, దామోదర్, మహబుబ్‌పీరా పాల్గొన్నారు.

లింగమయ్య కుటుంబానికి ఆర్థిక సాయం

రామగిరి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డిపల్లికి చెందిన మజ్జిగ లింగమయ్య కుటుంబానికి ప్రొఫెసర్ రాజేశ్ శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఆయన భార్య, కుమారులుకు రూ.లక్ష చెక్కును అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనో ధైర్యం నింపారు.

చీనీ వ్యాపారులు నిబంధనలు పాటించాలి

అనంతపురంరూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): చీనీ వ్యాపారులు మార్కెట్‌లో నిబంధనలకు ప్రకారం నడుచుకోవాలని అనంతపురం వ్యవసాయ మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆయన యార్డు సహాయ కార్యదర్శి రూప్‌కుమార్‌తో కలసి చీనీ మార్కెట్‌లోని వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రెండు రోజుల కిందట జరిగిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చీనీ మార్కెట్ ఆకస్మిక తనిఖీపై వ్యాపారులతో చర్చించారు. రైతుల నుంచి వ్యాపారులు పది శాతం కమీషన్ రూపంలో తీసుకుంటున్నట్లు అన్నారన్నారు. నిబంధల ప్రకారమే రైతుల నుంచి కమీషన్ తీసుకోవాలన్నారు. అలా కాకుండా కమీషన్ తీసుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా రైతుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. అలా వస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అదేవిధంగా బాడుగలు చెల్లించని వారు వెంటనే చెల్లించాలన్నారు.

గుండెపోటుతో ట్రాన్స్‌కో కాంట్రాక్టు ఉద్యోగి మృతి

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్టు ఆపరేటర్‌గా పనిచేస్తున్న సుబ్రమణ్యం(40) అనే ఉద్యోగి శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. సబ్‌స్టేషన్‌లో విధులు ని ర్వర్తిస్తుండగా ఉన్న ఫలంగా గుండెపోటుతో కుప్పకూలాడు. వెంటనే తోటి ఉద్యోగులు, స్థానికులు చికిత్స నిమిత్తం ధర్మవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య సునీత, కుమారుడు ఉన్నారు. కాగా అధికారుల వేధింపులు కారణంగానే ఉద్యోగి మృతిచెందాడని పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి



ధర్నాలో మాట్లాడుతున్న యూజేఏసీ కన్వీనర్ జాఫర్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం సరైంది కాదని యూజేఏసీ కన్వీనర్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. వక్ బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ(యూజేఏసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. భారత పౌరులుగా ఇస్లాం, ఇస్లామిక్ చట్టంపై మతవిశ్వాసాన్ని ఆచరించే హక్కు తమకు రాజ్యాంగం కల్పించిందన్నారు. అనంతరం యూజేఏసీ నాయకులు డీఆర్ఓ మలోలను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నా యకులు వసీం, ఖాజా హుస్సేన్, అల్లీపీర, బంగారు బాషా, కాగజ్ ఘర్ రిజ్వాన్, నదీమ్ అహ్మద్, సైఫుల్లాబేగ్, ఖాజా, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్ బాషా, టిప్పుసుల్తాన్ జాకీర్, ముక్తియార్ పాల్గొన్నారు.

కురుగుంట పాఠశాలలో వాటర్ బెల్



వాటర్ బాటిళ్లతో విద్యార్థులు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 సంయుక్త ఆధ్వర్యంలో వాటర్ బెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మై భారత్ స్టేట్ కో ఆర్డినేటర్ బిస్వతి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా వాటర్ బాటిల్స్ అందించారు. కార్యక్రమంలో ఎస్సార్ ఎడ్యుకుషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, సొసైటీ కార్యదర్శి ప్రసిల్లా, ఇండియన్ రెడ్ క్రాస్ వాలంటీర్లు మహేంద్ర, నందిత పాల్గొన్నారు.

మత సామరస్యానికి చిహ్నం.. చియ్యేడు దర్గా

నేటి నుంచి హజరత్ షేక్ ఇమాంషావలి ఉరుసు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యేడు గ్రామంలో వెలసిన హజరత్ షేక్ ఇమాంషావలి దర్గా మత సామరస్యానికి చిహ్నంగా నిలుస్తోంది. గ్రామంలోని ముస్లింలు ఇమాం షా వలీ స్వామిగా, హిందువులు దస్తగిరిస్వామిగా కొలుస్తారు. ఈ క్రమంలోనే దర్గా ఉత్సవాలను గ్రామస్థులందరూ కలిసి నిర్వహిస్తారు. శనివారం నుంచి రెండురోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దర్గా మేనేజర్ హజరత్ షేక్ హాజీ గఫూర్ సాహెబ్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మెదటి రోజు శనివారం గంధం పూజ, రాత్రి పూల పల్లకీలో గ్రామంలో ఊరేగింపు, పకీర్ల జల్సాతో దర్గాలో పూజలు నిర్వహిస్తారు. ఆదివారం ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాలకు చుట్టుపక్కల ఉన్న పూలకుంట, కృష్ణంరెడ్డిపల్లి, ఇటుకలపల్లి, ఉప్పరపల్లి తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారు. ఆదివారం రాత్రి ప్రముఖ కళాకారులతో పంచారత్నావళి నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు దర్గా మేనేజర్ తెలిపారు.



చియ్యేడులోని హజరత్ షేక్ ఇమాంషావలి దర్గా, ఇమాంషావలి సమాధి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి: బడుగులకు కష్టం ఉందంటే మొదట స్పందించేది సీఎం చంద్రబాబునాయుడేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు మండలాల్లోని 23 మంది బాధితులకు రూ.9.66 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆరోగ్యశ్రీ వర్తించని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేదలకు సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేసి ఆదుకుంటున్నారన్నారు.

నేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రెండో శనివారమైనా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేయనున్నాయి. యథావిధిగా రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉదయం11గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనిచేస్తాయని అధికారులు తెలిపారు.

భవనం నుంచి పడి వాచ్‌మన్ మృతి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఓ భవనం నుంచి ప్రమాదవశాత్తు పడి వాచ్‌మేన్ సురేష్ (41)మృతి చెందాడు. బెళుగుప్ప ఎస్సీ కాలనీకి చెందిన సురేష్ గత కొంతకాలంగా నగరంలోని లక్ష్మీనగర్ నివాసముంటున్నాడు. ఆదే ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తున్న భవనానికి వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం సామగ్రిని పై అంతస్తులకు తీసుకెళ్లే తొట్టిలో సురేష్ నిలుచున్నాడు. పైకె తీసుకెళ్లే క్రమంలో భయపడిన సురేష్ కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలకు గురై అతను మృతి చెందాడు. తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం డిమాండ్ చేస్తోంది.

వ్యసనాలతోనే చోరీలు

నార్పల,ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను శుక్రవారం నార్పల పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్‌లు అరెస్ట్ వివరాలను వెల్లిడించారు. మండల కేంద్రమైన నార్పలకు చెందిన నాగేశ్వరి, హోటల్ రాజన్న ఇంట్లో చోరీలు చేశారు. ఈ కేసులో విచారణ చేపట్టిన ఎస్ఐ సాగర్ నార్పలకు చెందిన ధనరాజ్, శ్రీనివాసులు, ప్రవీణ్‌లు చెడు వ్యసనాలకు బానిసై డబ్బుల కోసం ఈ చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. నిందితులను నార్పల క్రాస్ వద్ద అరెస్ట్ చేసి వారి నుంచి ఐదు జతల బంగారు కమ్మలు, రెండు ఉంగరాలు, రెండు జతల వెండి గొలుసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

రామగిరి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని భవిత కేంద్రంలోని దివ్యాంగపిల్లలకు శుక్రవారం ఉపకరణాలు పంపిణీచేశారు. ఎంఈఓ శ్రీనివాసులు చేతులమీదుగా ఒక వీల్‌చైర్, రెండు సీపీచైర్స్, ఒక జత ఈరెంగ్ ఎయిడ్, రెండు రోలేటర్స్, ఎంఆర్‌కిడ్స్ పంపిణీచేశారు. ఈ ఉపకరణాలు పిల్లలకు ఎంతో ఉపయోగపడగతాయన్నారు.

చలివేంద్రానికి నెలవారిగా పొదుపు

ఎస్కేయూ ఉద్యోగి ఔదార్యం

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యార్థులు, ఉద్యోగుల దాహార్తిని తీర్చేందుకు ఓ ఉద్యోగి పొదుపు చేసి తన ఔదార్యాన్ని చాటుకుంటున్నారు. నెలవారిగా రూ.2వేల చొప్పున ప్రత్యేకంగా బ్యాంకులో జమచేసి, ఆ మొత్తాన్ని ఏప్రిల్ నెలలో డ్రా చేసి జ్యోతిబా పూలే జయంతి రోజున చలివేంద్రాన్ని ప్రారంభించడం ఎస్కేయూ సూపరింటెండెంట్, బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మణరావు కొన్నేళ్లుగా చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఎస్కేయూ ప్రధాన ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ క్రిష్ణకుమారి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ ప్రారంభించారు. వేసవిలో 40 రోజులపాటు వారి దాహార్తిని తీర్చేలా ప్రతియేటా లక్ష్మణరావు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని వీసీ అనిత కొనియాడారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీసీ అనిత, ఇతర అధికారులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ


బాధితురాలికి చెక్కు ఇస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గుమ్మగట్ట మండలం తాళ్లకేరకు చెందిన సరస్వతికి రూ.81వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అందజేశారు. శుక్రవారం అనంతపురం నగర శివారులోని ఆయన నివాసంలో బాధితురాలికి చెక్కును అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గుత్తిరూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాపురం గ్రామ శివారులోని 67వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన పవన్, రాజు బైక్‌లో గుంతకల్లుకు బయలుదేరారు. రజాపురం గ్రామశివారులోకి రాగానే వెనుక నుంచి ఐషర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైలు నుంచి పడి వృద్ధురాలికి..

గుత్తి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైల్లోంచి పడి నాగరత్నమ్మ అనే వృద్ధురాలు గాయపడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. చిత్తూరు జిల్లా పీలేరుకు చెందిన నాగరత్నమ్మ తన కుమార్తెతో కలిసి గురువారం సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్నారు. అయితే రైలు గుత్తి రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే నాగరత్నమ్మ నిద్రమత్తులో బాత్‌రూం డోర్ అనుకొని మెయిన్‌డోర్‌ను తీసి ప్రమాదవశాత్తూ కిందపడింది. తీవ్రంగా గాయపడిన ఆమె రాత్రి చీకట్లో అక్కడే ఉండి పోయింది. శుక్రవారం ఉదయం కీమెన్ రామాంజనేయులు గమనించి వెంటనే రైల్వే పోలీసులకు, 108కు సమాచారం అందించారు. ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కుటుంబసభ్యులకు సమాచారం అందించామని రైల్వేపోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైలు ఇంజిన్ ఢీకొని ఒకరికి..

యాడికి: రైలు ఇంజన్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం జరిగింది. గుంతకల్లు మండలం గురబ్బాడు గ్రామానికి చెందిన భాస్కర్ యాడికి మండలం బోయరెడ్డిపల్లి గ్రామం వద్ద ఉన్న అదాని సిమెంట్ ఫ్యాక్టరీలో గ్యాంగ్‌మెన్‌గా పనిచేస్తున్నారు.ఈ క్రమంలో ఫ్యాక్టరీ వద్ద రైలు పట్టాలపై విధులు నిర్వర్తిస్తుండగా రైలు ఇంజన్ వెనుక నుంచి వచ్చి ఢీకొంది. ప్రమాదంలో అతడికి రెండు కాళ్లు, నడుము భాగం విరిగింది. సమాచారం అందుకున్న ఫ్యాక్టరీ సిబ్బంది భాస్కర్‌ను తాడిపత్రి ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

సచివాలయం తనిఖీ

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలవెంకటాపురం సచివాలయాన్ని ఎంపీడీఓ నందకిశోర్ శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశించిన సర్వేలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

నేడు విరూపాక్షేశ్వరుడి కల్యాణం

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దోనిముక్కల గ్రామంలో గల విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శనివారం పంపాదేవి, విరూపాక్షేశ్వర స్వామి కల్యాణం, సీతారాముల కల్యాణంను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్‌పర్సన్ ఎన్.సంజీవమ్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అలాగే విరూపాక్షేశ్వర స్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

యల్లనూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నపూసపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవీంద్ర శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వెన్నపూసపల్లి, కోడిమూర్తి, గడ్డంవారిపల్లి, దుగ్గుపల్లి గ్రామాల్లో సరఫరా నిలిపివేయనున్నామని, ఆయా గ్రామాల ప్రజలు గమనించాలని కోరారు.

ప్రవేశ పరీక్ష 21వ తేదీకి మార్పు

విడపనకల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించే తేదీని మార్పు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర గౌడ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఈనెల 20న నిర్వహించాల్సి ఉండగా, ఆ రోజు ఈస్టర్ డే ఉందని, కనుక పరీక్షను 21వ తేదీకి మార్పు చేసినట్లు తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులు గమనించాలన్నారు.

హుండీ లెక్కింపు

తాడిపత్రి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఉన్న పొలిమేర పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. దసరా నుంచి ఉగాది ఉత్సవాల వరకు భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించగా రూ.2,78,956 ఆదాయం వచ్చింది. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేలకూలిన బొప్పాయి చెట్ల పరిశీలన

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలవెంకటాపురం గ్రామంలో రైతు అంతేష్ సాగు చేసిన 4 వేల బొప్పాయి చెట్లు గురువారం కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులకు నేలకూలాయి. దీంతో ఆ పొలాన్ని ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ భాస్కర్ నాయక్, టీడీపీ నాయకుడు దేవినేని అవినాశ్ శుక్రవారం పరిశీలించారు. ఎంత నష్టం జరిగిందని బాధిత రైతుతో వివరాలడిగి తెలుసుకున్నారు. నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదికలు అందించి పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. హార్టికల్చర్, వ్యవసాయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పంప్‌హౌస్ పరిశీలన

రాయదుర్గంటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మండలంలోని టీ వీరాపురం నుంచి కణేకల్ క్రాస్ వరకు విద్యుత్‌తీగలు తెగిపోవడంతో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళు శిల్ప, మున్సిపల్ ఏఈ నరసింహులు, విద్యుత్ అధికారులు టీ.వీరాపురం వద్ద ఉన్న తాగునీటి పంప్‌హౌస్‌ను శుక్రవారం పరిశీలించారు. అలాగే తెగిపోయిన విద్యుత్‌తీగలు, విద్యుత్‌స్తంభాలను పరిశీలించారు. మున్సిపల్, విద్యుత్ సిబ్బంది కలిసి తెగిపోయిన విద్యుత్‌వైర్లను త్వరగా మరమ్మతులు చేసి పట్టణ ప్రజలకు నీటి సరఫరా చేయాలని సూచించారు.

అధైర్య పడకండి.. ఆదుకుంటాం: కాలవ

● అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు భరోసా


గోనేహాళ్ వద్ద వరి పంటను పరిశీలిస్తున్న కాలవ, ఆర్డీఓ వసంతబాబు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అకాల వర్షం, ఈదురు గాలులతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చేస్తానని, ఎవరూ అధైర్య పడొద్దని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు బాధిత రైతులకు భరోసా ఇచ్చారు. మండలంలోని గోనేహాళ్, శ్రీధరఘట్ట గ్రామాల్లో అకాలవర్షాలకు దెబ్బతిన్న వరి, పత్తి పంటలను శుక్రవారం ఆయన తుంగభద్ర ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కేశవరెడ్డి, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, ఏఓ సాయికుమార్, తహసీల్దార్ మునివేలుతో కలిసి పరిశీలించారు. చేతికి అందాల్సిన పంట ఇలా నష్టం మిగిల్చిందని బాధిత రైతులు కుబేర, శివలింగన్న, రాజేశ్వరప్ప తదితరులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోకపోతే మా పరిస్థితి అధోగతేనని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ.. పంట లు నష్టపోయిన రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని విధాలుగా అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఇక్కడ జరిగిన నష్టంపై అధికారుల ద్వారా ప్రాథమిక నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. అదే విధంగానే వ్యవసాయ మంత్రి అచ్చెంనాయుడు దృష్టికి, అవసరమైతే సీఎం దృష్టికి కూడా తీసుకెళ్లి నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరిగేలా చేస్తామని తెలిపారు. కౌలు రైతులు కూడా ఎలాంటి బాధ పడొద్దని, ఆదుకుంటామని నమ్మకం కల్పించారు. వీలైనంత తొందరగా నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ వాణి జగన్నాథ్‌రెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు యర్రగుంట్ల వెంకటేశులు, స్టోర్‌డీలర్ల సంఘం మండలఅధ్యక్షుడు పయ్యావుల మోహన్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలంలోని కణేకల్లుక్రాసింగ్, పుల్లంపల్లి, గోపులాపురం, కొత్తపల్లి తదితర ప్రాంతాలలో దెబ్బతిన్న మొక్కజొన్న, అరటి తదితర పంటలను కూడా కాలవశ్రీనివాసులు పరిశీలించారు. బాధిత రైతులను ఆదుకుంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. తహశీల్దార్ నాగరాజు, ఏవో శ్రావణ్‌కుమార్, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, కోకుర్తి సుదర్శన్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

రాయదుర్గంటౌన్: సీఎం రిలీఫ్ ఫండ్ కింద నియోజకవర్గంలోని ఆరుగురు లబ్ధిదారులకు 5.16 లక్షల మేర నిధులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను పట్టణంలోని తన నివాసంలో ప్రభుత్వవిప్ కాలవ శ్రీనివాసులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాయదుర్గం మండలం గ్రామదట్లకు చెందిన గొల్ల మల్లికార్జునకు రూ. 2,01,955, గుమ్మఘట్ట మండలం పూలకుంటకు చెందిన ఎన్.రుద్రాక్షికి రూ.87,718, గోనేహాళ్‌కు చెందిన వన్నూరుస్వామికి రూ. 38 వే లు, గొల్లపల్లికి చెందిన కొలిమి జయతున్‌కు రూ. 78,658, గోనబావికి చెందిన వడ్డేజ్యోతికి రూ. 69,148, కదరంపల్లికి చెందిన నాగలక్ష్మికి రూ. 41112 మేర చెక్కులను పంపిణీ చేశారు. టీడీపీ మండలకన్వీనర్ హనుమంతు, నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలి

● పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున ముస్లింల ర్యాలీ



పామిడిలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

తాడిపత్రి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలంటూ పట్టణంలో ముస్లింలు శుక్రవారం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక సిద్ధిబాషా దర్గా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు వల్ల ముస్లింలకు అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ బిల్లును వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు.లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అరీఫ్, సయ్యద్ హయ్యద్‌బాషా, జాకీర్, అయూబ్, ఫయాజ్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

● పామిడి: పట్టణంలో ముస్లింలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఖిల్లా జామియా మసీదు నుంచి నూతన ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్దనున్న ఈద్గా వరకు కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగానినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

● కణేకల్లు: మండల కేంద్రంలో ముస్లింలు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. దిగువగేరి నుంచి వందలాదిమంది తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ కేంద్రం వెంటనే వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. లేని పక్షంలో ముస్లింల ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

రెండోరోజూ ఎన్‌ఎంయూ ధర్నా

తాడిపత్రి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలంటూ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు శుక్రవారం రెండో రోజూ ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ రీజనల్ సెక్రటరీ ప్రతాప్‌నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం జారీచేసిన 1/2019 సర్క్యులర్‌ను కిందిస్థాయి సిబ్బంది అమలుచేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నాగేశ్వరరెడ్డి, రంగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పాట్ అడ్మిషన్లు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తిరుపతికి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహా విద్యాలయం (డీమ్డ్ యూనివర్శిటీ) లో 2025-26వ సంవత్సరానికిగాను ఇంజనీరింగ్, ఆయుర్వేదం మేనేజ్‌మెంట్, యూజీ, పీజీ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాస్, అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ, కంచికోటి శంకర మఠం ప్రతినిధులు బ్రహ్మశ్రీకుప్పాజగన్నాథ శర్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కంచి కామకోటి పీఠం శంకరాచార్యుల చేత స్థాపించిన ఆ యూనివర్శిటీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని విద్యార్థులు ప్రవేశం పొందవచ్చన్నారు. శనివారం పట్టణంలోని గుత్తిరోడ్డులో గల ఇల్లూరు లక్ష్మీనారాయణ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9629032323, 9629001144, 8098001630 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించండి: ఎమ్మెల్యే అశ్మిత్

తాడిపత్రి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకూడదని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి అధికారులకు ఫోన్ ద్వారా సూచించారు. వారం క్రితం విదేశాలకు వెళ్లిన ఎమ్మెల్యేకు యాడికి మండలం నాయకులు ఫోన్ చేసి కొన్ని గ్రామాల్లో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. స్పందించిన ఆయన శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మున్సిపల్, పంచాయతీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నియోజకవర్గంలో ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య రాకూడదని హెచ్చరించినట్లు, సమస్య వెంటనే పరిష్కరించాలని సూచించినట్లు తెలిసింది.

6వ రోజుకు చేరిన సమ్మె

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వేతనాలు ఇవ్వాలని పట్టణంలో శ్రీరామిరెడ్డి కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి ఆరో రోజుకు చేరింది. స్థానిక తాగునీటి పంపుహౌస్ వద్ద వారు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మద్దతు పలికారు. సీఐటీయూ మండల కార్యదర్శి రంగనాథ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ కార్మికుడి మృతి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరేసముద్రం గ్రామ శివారులో ఉన్న జిందాల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఓ కార్మికుడు మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌ఓ నరేంద్ర తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రం జుంజుర్ల జిల్లా కెర్లా గ్రామానికి చెందిన ముకేష్‌కుమార్(36) గత కొంత కాలం నుంచి జిందాల్‌లోని పైపులు తయారీ సెక్షన్‌లో పని చేస్తున్నాడు. కాగా శుక్రవారం తెల్లవారుజామున పని చేస్తూ ఉన్నట్టుండి కుప్పకూలాడు. తోటి కార్మికులు వెంటనే బళ్లారి విమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కార్మికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

ఘనంగా పూలే జయంతి

● వాడవాడలా ఘన నివాళి


గుత్తి ఆర్‌ఎస్‌లో విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సంఘసంస్కర్త మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి వేడుకలను అన్ని ప్రాంతాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీల నా యకులు, సంఘాల సభ్యులు ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి ఆయన చేసిన సేవల్ని గుర్తు చేసుకున్నారు. కణేకల్లు మండలకేంద్రంలోని క్రాసింగ్‌లో విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాలవశ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సమాజంలో అంటరానితనం నిర్మూలన కోసం, బడుగుల అభ్యున్నతి కోసం, మహిళా సాధికారత కోసం మహాత్మాజ్యోతిరావు పూలే చేసిన కృషి అమోఘమని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని సూచించారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుంతకల్లు పట్టణంలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ ఆవిష్కరించి నివాళులర్పించారు. అలాగే ఎస్కేపీ డిగ్రీ కళాశాల ఆవరణలోని పూలే విగ్రహం వద్ద నివాళులర్పించారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రజావేదిక వద్ద పూలే చిత్రపటానికి టీడీపీ నాయకుడు దేవినేని అవినాశ్ పూలమాల వేసి నివాళులర్పించారు

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

విడపనకల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుమడుగు గ్రామంలో నూతనంగా నిర్మించిన పట్టాభి రాముడి ఆలయాన్ని వైభవంగా ప్రారంభించారు. గ్రామస్థులు దాదాపు రూ. 40 లక్షల మేర విరాళాలు సేకరించి ఈ ఆలయాన్ని నిర్మింపజేశారు. మూడు రోజులుగా జరుగుతున్న ఆలయ ప్రారంభ వేడుకల్లో వేద పండితులు పలు హోమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయం ఎదుట హోమం నిర్వహించి ఆలయంలో పట్టాభిరాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రైతుకు రూ.80వేలు బురిడీ..

యాడికి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తాను పొదుపు సంఘం అధికారినంటూ రైతును బురిడీ కొట్టించి ఆన్‌లైన్‌లో రూ.80వేలు దోచేసిన సంఘటన శుక్రవారం జరిగింది. మండలంలోని కోనుప్పలపాడు గ్రామానికి చెందిన ఒక రైతుకు గుర్తుతెలియని నెంబర్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ఫోన్‌కాల్‌లో అవతలి వ్యక్తి తాను పొదుపుసంఘాల అధికారినంటూ రైతును మాటలతో కలిపి మీకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని వస్తున్నాయా లేదా అని ఆరాతీశాడు. మీకు పథకాల లబ్ధి చేకూరాలంటే మీకు ఒక లింక్ పంపిస్తాను దానిని క్లిక్ చేయండి అంటూ చెప్పినట్లు బాధిత రైతు తెలిపాడు. అవతలి వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ పూర్తయ్యేలోపే తన ఖాతా నుంచి రూ.80 వేలు డ్రా అయినట్లు బాధిత రైతుకు మెసెజ్ వచ్చింది. దీంతో గుర్తుతెలియని ఫోన్‌కాల్‌తో తాను తీవ్రంగా నష్టపోయినట్లు బాధిత రైతు తెలిపాడు. దీనిపై సైబర్‌క్రైంకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతు తెలిపాడు.

ఈదురు గాలులకు కూలిన గాలిమర


కిందపడిన గాలిమర

పుట్లూరు, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ. కొండాపురం గ్రామశివారులో ఉన్న గాలిమర శుక్రవారం తెల్లవారుజామున వీచిన ఈదురుగాలులకు నేలకూలి ధ్వంసమైంది. భారత్‌హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ కంపెనీకి చెందిన గాలిమర సుమారు పదేళ్ల నుంచి వినియోగంలో లేదు. అది తిరగకపోవడంతో బెడ్లకు ఉన్న యాంగ్లేర్లను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. దీంతో బెడ్లు పూర్తిగా దెబ్బతినడంతో వీచిన ఈదురుగాలులకు ఆ గాలిమర పడిపోయినట్లు సంస్థ సిబ్బంది తెలిపారు. 2000వ సంవత్సరంలో రూ. 60 లక్షల వ్యయంతో దీనిని ఏర్పాటు చేశామని చెప్పారు. కానీ ఈ కంపెనీకి చెందిన గాలిమరలు మండలంలో పూర్తిగా వినియోగంలో లేనట్లు తెలిసింది.

ప్రభుత్వ లేఅవుట్ కబ్జాపై చర్యలు

ఆంధ్రజ్యోతి స్పందన

యాడికి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): చందనలో ప్రభుత్వ లేఔట్ కబ్జాపై అధికారులు చర్యలు చేపట్టారు. దర్జాగా ప్రభుత్వ లేఔట్ కబ్జా అనేక శీర్షికన ఈ నెల 4వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన రెవెన్యూ అధికారులు కబ్జాకు గురైన ప్రభుత్వ లేఔట్‌ను శుక్రవారం పరిశీలించారు. నెంబర్‌రాళ్లను తొలగించిన వ్యక్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లేఔట్ కబ్జాచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నెంబర్‌రాళ్లను తొలగించిన వ్యక్తి చేతనే వాటిని తిరిగి ఏర్పాటు చేయించారు. చందన వీఆర్వో నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ, అసలు లేకుండా రుణాలు రెన్యూవల్ చేయాలి

పెద్దవడుగూరు, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): రైతులు పంట సాగుకోసం బ్యాంక్ నుంచి తీసుకున్న రుణాలను వడ్డీ, అసలు లేకుండా రెన్యువల్ చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని ఆంధ్రాబ్యాంక్ మేనేజర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, సంఘం అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, మండల కార్యదర్శి మద్దిలేటి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి: మెట్టు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గత రెండురోజులుగా గాలివాన బీభత్సవానికి బొమ్మనహాళ్, కణేకల్లు, డీ.హీరేహాళ్ మండలాల్లో పంటలు దెబ్బతిన్న రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ ప్రకటన విడుదల చేశారు. నష్టాన్ని సంబంధిత అధికారులు అంచనా వేసి పరిహారం కోసం తక్షణం నివేదికలు పంపాలన్నారు. అకాల వర్షానికి రాయదుర్గం నియోజకవర్గంలో ఎక్కువ నష్టం చేకూరిందన్నారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి నష్టపోయిన ప్రతిరైతుకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిహారం అందించకపోతే రైతుల పక్షాన పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

వంటగ్యాస్ ధర తగ్గించాలి

రాయదుర్గంటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను వెంట నే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో వినాయకసర్కిల్ వద్ద నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం నిరసన చేపట్టారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్, ఏపీ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తిప్పేస్వామి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజినేయులు, సీపీఐ మండల కార్యదర్శి దుర్గన్న, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నేడు సంగమేశ్వరుడి రథోత్సవం

కూడేరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో జోడులింగాల సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మడుగు తేరు, రథోత్సవ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఇందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆలయ ఆవరణలో నూతన రథం వద్ద శుక్రవారం వేదపండితులు ప్రాణ ప్రతిష్ఠ హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. గతంలోని రథం పూర్తిగా దెబ్బతినడంతో నూతన రథాన్ని దాతలిచ్చిన విరాళాలతో తయారు చేయించారు. నూతన రథం వద్ద వేద పండితులు పూజలు నిర్వహించారు.

ఐరావతంపై ఊరేగిన స్వామివారు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరులు ఐరావత వాహనంపై విహరించారు. ఉదయమే అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌లకు రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి సమయంలో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఐరావత వాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. అలాగే ఆలయ ఆవరణలో భోగిశెట్టి శివానంద కుటుంబ సభ్యుల సహకారంతో పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవ వేడుకల వేద పడింతులు వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఘనంగా మల్లికార్జునుడి కల్యాణం

ఉరవకొండ, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మల్లేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భ్రమరాంబ, మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని ఘనగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అర్చకులు ఆలయంలో మల్లేశ్వర స్వామి స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భ్రమరాంబ, మల్లికార్జున స్వామిని ఉత్సమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని నిర్వహించారు. తర్వాత నంది వాహనంపై ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగపూజ

విడపనకల్లు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సుంకులమ్మదేవి, దేవమ్మదేవి రథోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ఆలయంలోని అమ్మవార్లను అర్చకులు ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న గౌరమ్మ బావి వద్దకు వెళ్లి గంగపూజ చేశారు. తర్వాత గంగను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. శనివారం సాయంత్రం అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రావులుడికిలో చెన్నమ్మ తిరుణాల

పెద్దవడుగూరు: మండలంలోని రావులుడికిలో శుక్రవారం చెన్నమ్మతల్లి తిరుణాల ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు తొలుత స్థానిక ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. రైతులు తమ ఎద్దులచేత సూరపుబండిని లాగించారు. అనంతరం భక్తులు పాలపొంగులు నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.


రెండు నదులు కలిసే చోట వెలసిన ఆలయం

నదుల సంగమేశ్వరం..

● చోళరాజుల కాలం నాటి శివాలయం
● నేటి నుంచి స్వామివారి ఉత్సవాలు
● భారీగా తరలిరానున్న భక్తులు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగనహళ్లి గ్రామ సమీపాన వేదవతి హగరి నది ఒడ్డున వెలసిన శ్రీ సంగమేశ్వరాలయానికి దశాబ్దాల చరిత్ర ఉంది. చోళరాజుల కాలంలో నిర్మించారు. వేదవతి పెద్ద హగరి, చిన్న హగరి నదుల సంగమ ప్రదేశంలో వెలసిందీ క్షేత్రం. ఇక్కడున్న సంగమేశ్వరుడిని దర్శించుకుంటే సకల పాపాలు హరించుకుపోతాయని భక్తుల నమ్మకం. క్రీ.శ. 1100లో చోళరాజులు ఆలయాన్ని నిర్మించి, జోడు శివలింగాలను ప్రతిష్ఠించినట్లు పూర్వీకుల చెప్పినట్లు స్థానికులు అంటున్నారు. ఆలయంలోని శివలింగాలను గతంలో వేదవతి హగరి వరద నీరు ఏటా తాకేదని చెబుతున్నారు. రెండేళ్ల క్రితం భారీగా వరద వచ్చినపుడు కూడా శివలింగాలను నీరు తాకింది. స్వామివారి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇప్పటికే పెద్దఎత్తున భక్తులు చేరుకున్నారు.

నేటి నుంచి ఉత్సవాలు

ఏటా చైత్ర పౌర్ణమి నుంచి స్వామివారి ఉత్సవాలు నిర్వహిస్తారు. శనివారం ఉదయం సంగమ్మ, సంగమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను గ్రామం నుంచి దేవాలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్తారు. అక్కడ అభిషేకాలు చేస్తారు. స్వామి, అమ్మవారికి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆదివారం వేకువజామున 5:30 గంటలకు ఉత్సవం, సాయంత్రం 6 గంటలకు స్వామివారి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


ఆలయంలోని శివలింగాలు